నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 19-6-2026  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:243 పేజీలు:6 వెల: రూ.1/-


## నేటి కందం-నేటికి అందం

గాసిని దొలగించుటకై
భాసురముగ కృషి సలిపెడి భారత్ పైనన్
జీ సెవెను సమావేశము
చేసినది ప్రశంస మిగుల శ్రేష్ఠతరముగన్ !!

(జరుగుతున్న జీ సెవెన్ సమ్మిట్ లో భారత దేశం చేస్తున్న కృషికి అన్ని దేశాల నుండీ ఎన్నో ప్రశంసలు భారత్ కు లభిస్తున్నాయి. ప్రధాని మోడీని అందరూ అభినందిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

## చురక

ప్రభుత్వంకు దీటుగా
ప్రైవేటులో స్కూళ్లు
విద్యను అమ్ముకునే
వ్యాపారం మాళ్లు.
ఫీజులు నియంత్రించే
పవర్ ఎక్కడున్నది
కట్టలేని తల్లిదండ్రుల
కడుపు కొట్టుతున్నది



-వేల్పుల నారాయణ
9440433475

# తెలంగాణలో ఇక డిజిటల్ కేబినెట్..



హైదరాబాద్, జూన్ 18:సాంకేతికతను పాలనలో మరింత విస్తృతంగా వినియోగించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలు పూర్తిగా డిజిటల్ విధానంలో, పేపర్‌లెస్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీంతో తెలంగాణ కేబినెట్ సమావేశాలకు కొత్త రూపు రానుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తాజా మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయానికి ఆమోదం లభించింది. సమావేశానికి ముందు అధికారులు లేకుండా కేవలం మంత్రులతోనే సీఎం ప్రత్యేకంగా చర్చలు జరిపి డిజిటల్ కేబినెట్ విధానంపై అవగాహన కల్పించారు.

ఈ కొత్త విధానంలో భాగంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహా మంత్రులందరికీ ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు. ఇకపై మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన ఎజెండా, ప్రతిపాదన లు, నివేదికలు అన్నీ ఈ-బుక్ రూపంలో నేరుగా ఆయా ట్యాబ్‌లలో అందుబాటులోకి రానున్నా యి. పేపర్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడంతో పాటు నిర్ణయాల ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, సమాచార భద్రతను పెంచడం, పరిపాలనలో పారదర్శ కతను తీసుకురావడం ఈ విధానం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంటోంది. ఇప్పటికే ఈ వ్యవస్థ అమ లుకు సంబంధించిన సాంకేతిక ఏర్పాట్లు పూర్తయ్యా యని అధికారులు వెల్లడించారు. డిజిటల్ కేబినెట్ పనితీరును స్వయంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆధునిక సాంకేతికత ఆధారిత పాలనలో తెలం గాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిం చారు. వేగవంతమైన నిర్ణయాలు, సమర్థవంతమైన పరిపాలన కోసం డిజిటల్ విధానాల వినియోగాన్ని మరింత విస్తరించనున్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.

## తెలంగాణ ఈగల్ ఫోర్స్ స్పెషల్ ఆపరేషన్ సక్సెస్

-80 కిలోమీటర్ల ఛేజ్ తర్వాత గంజాయి వాహనం స్వాధీనం



హైదరాబాద్, జూన్ 18: గంజాయి అక్రమ రవాణాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ప్రత్యేక నిఘా, దర్యాప్తు ఆధారంగా ఒడిశాలో చేపట్టిన చర్యల్లో ఏకంగా 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలో పట్టుబడిన గంజాయి ముఠాల లింక్‌ల ఆధారంగా ఈగల్ ఫోర్స్ బృందం ఒడిశాకు వెళ్లింది. అక్కడ బలిమెల నుంచి జయపూర్ వరకు దాదాపు 80 కిలోమీటర్ల మేర గంజాయి తరలిస్తున్న వాహనాన్ని వెంబడించి పట్టుకుంది. వాహనాన్ని తనిఖీ చేయగా వివిధ ప్యాకెట్లలో దాచిన 500 కిలోల గంజాయి బయటపడింది. వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై దర్యాప్తు ప్రారంభించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

## నీట్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్

హైదరాబాద్, జూన్ 18:(నేటినిజం ప్రతినిధి) :వైద్య విద్యలో ప్రవేశానికి కీలకమైన నీట్-యూజీ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. పరీక్ష కేంద్రాలకు చేరుకునే క్రమంలో రవాణా భారం తగ్గించేందుకు జూన్ 21న జరిగే నీట్ పరీక్ష రోజు టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించింది.

ఈ నిర్ణయం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్ (అడ్మిట్ కార్డు) చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించ వచ్చు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన మరేదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.

ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ తదితర నగరాల్లోని పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు రవాణా ఖర్చు తగ్గడంతో పాటు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే అవకాశం లభించనుంది. పరీక్ష రోజు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. అవసరమైన మార్గాల్లో అదనపు బస్సులు నడపడంతో పాటు ప్రధాన బస్టాండ్లలో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయనుంది. విద్యార్థులు ముందుగానే బయలుదేరి పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతుండగా, పరీక్ష రోజు రవాణా ఇబ్బందులు ఎదురుకాకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో దారుణం.. మైనింగ్ గొడవల్లో స్థానిక నేత సజీవ దహనం

న్యూ ఢిల్లీ, జూన్ 18: ఛత్తీస్‌గఢ్‌లో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇరు వర్గాల మధ్య చెలరేగిన వివాదం దారుణ మలుపు తిరిగింది. స్థానిక నేత, జన్‌పద్ పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. కొరియా జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

జాతీయ మీడియా కథనాల ప్రకారం, స్థానికంగా ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్‌ను భరత్ సింగ్ దక్కించుకున్నారు. ఈ క్రమంలో మనోజ్ త్రిపాఠీ వర్గంతో భరత్ సింగ్‌కు వివాదం మొదలైంది. ఇసుక తవ్వకాల కోసం వాడే టిప్పర్ ట్రక్‌లు త్రిపాఠీ కుటుంబానికి చెందినవని స్థానికులు తెలిపారు. దీంతో, ఇసుక తరలింపు, చెల్లింపుల విషయంలో భరత్ సింగ్, త్రిపాఠీ వర్గాల మధ్య వివాదం మొదలైంది. చివరకు ఇది ఆధిపత్య పోరుగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడాయి.

ఇసుక తవ్వకాలకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు భరత్ సింగ్ నౌగెయిన్ గ్రామానికి వెళ్లారు. దీంతో, అక్కడ వివాదం చెలరేగగా భరత్ సింగ్ ప్రయాణిస్తున్న ఫార్చ్యునర్ కారును కొందరు అడ్డగించారు. తప్పించుకునే వీలులేకుండా కారుకు ముందు, వెనుక లారీలను అడ్డుపెట్టారు. ఆ తరువాత కారుపై పెట్రోల్ పోసి నిప్పటించడంతో భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. భరత్ సింగ్‌తో పాటు కారులో ఉన్న విరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా కాలిన గాయాలతో కన్నుమూశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మయాంక్ సింగ్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మృతుల కుటుంబం డిమాండ్ చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశామని ఏఎస్పీ సురేషా చౌబే తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని అన్నారు.

## కేబినెట్ భేటీలో రైతు భరోసా నిధుల విడుదలకు ముహూర్తం ఫిక్స్

హైదరాబాదా జూన్18: జూన్ 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ఈ భరోసా నిధులను ప్రభుత్వం జమ చేయనుంది. జూన్ 30వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో ఈ రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు.

రైతు భరోసా కింద రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు (ఖరీఫ్, రబీ) విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

మరో వైపు 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను కేంద్రం జూన్ 20వ తేదీన విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దాంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR)పై 22న జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం

హైదరాబాద్, జూన్ 18:(నేటినిజం ప్రతినిధి) జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (Special Intensive Revision – SIR) అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు మీడియా అకాడమీ ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది.

ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడు తుంది. కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది.

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

## ఆర్టీసీ ఉద్యోగులకు పొన్నం ప్రభాకర్ శుభవార్త

# జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్..

హైదరాబాద్, జూన్ 18: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు(గురువారం) టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించా రు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామ కాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయ నున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు






# నెల్లుట్ల ఫ్లైఓవర్ వద్ద ఘోర ప్రమాదం.. లారీ ఢీకొని ముగ్గురు దుర్మరణం






జనగామ , జూన్ 18: జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలంలోని నెల్లుట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హనుమకొండ-హైదరాబాద్ జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు.

ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలానికి చెందిన జాట్ రోహిత్ (22) హైదరాబాద్ నుంచి బొలెరో వాహనంలో సామాన్లు తీసుకుని వస్తుండగా నెల్లుట్ల ఫ్లైఓవర్ సమీపంలో టైర్ పంక్చర్ అయింది. దీంతో గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామానికి చెందిన తన డ్రైవర్‌ను జాకీ తీసుకుని రావాలని రోహిత్ చెప్పాడు. ఈ క్రమంలో దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన దొనికెన్ని రాజేందర్ (27) తన లారీలో హనుమకొండ వైపు వెళ్తూ వీరిని గమనించి సాయం చేసేందుకు రోడ్డుపక్కన వాహనాన్ని ఆపాడు. ముగ్గురూ కలిసి బొలెరో వాహనం వద్ద ఉండగా, హనుమకొండ వైపు నుంచి అతివేగంగా వచ్చిన మరో లారీ వెనుక నుంచి బొలెరోను ఢీకొట్టింది.

ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి.. విమాన సర్వీసులకు అంతరాయం

న్యూ ఢిల్లీ, జూన్ 18:రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరింత ఉధృతమవుతోంది. ఉక్రెయిన్ గురువారం వందలాది డ్రోన్లతో మాస్కోపై భారీ దాడి చేసింది. మాస్కోలోని కీలక చమురు శుద్ధి కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు మూతపడ్డాయి. విమాన రాకపోకలు నిలిచిపోయాయి

మాస్కోలోని కపోట్న్యా ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్ వందలాది డ్రోన్లతో దాడి చేసింది. దాడి అనంతరం భారీ మంటలు చెలరేగాయి. నల్లటి పొగ నగరమంతా వ్యాపించింది. ఇది వారం వ్యవధిలో కపోట్న్యా రిఫైనరీపై జరిగిన రెండో దాడి కావడం గమనార్హం. దాడి నేపథ్యంలో మాస్కోలోని షెరెమెత్యేవో, వ్నుకోవో, జూకోవ్‌స్కీ సహా పలువురు అంతర్జాతీయ విమానాశ్రయాలను మూసివేశారు. వందలాది విమానాలు నిలిచిపోవడంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు .

రష్యా కొనసాగిస్తున్న దాడులకు ఇది తగిన ప్రతిస్పందన అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు యుద్ధానికి మద్దతుగా నిలుస్తున్న రష్యాలోని కీలక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నామని ఆయన చెప్పారు. కాగా, మాస్కో వైపు వచ్చిన వందలాది డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని రష్యా అధికారులు ప్రకటించారు. కాగా, గత కొద్ది నెలలుగా రష్యా చమురు, ఇంధన మౌలిక వసతులపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను పెంచడంతో ఇంధన ఉత్పత్తి, సరఫరాపై ప్రభావం పడుతోంది.

# స్మార్ట్ ఫోన్ రాకతో గడియారం కనుమరుగౌతోందా !

## (19 జూన్ "జాతీయ గడియారం దినోత్సవం" సందర్భంగా)

నాటి నుంచి నేటి వరకు గడియారం మన శరీరంలో ఓ భాగమై పోయింది. చేతిలో స్మార్ట్‌ఫోన్ టైమ్‌ను సులభంగా సూచించినప్పటికీ మణికట్టుకు ధరించే గడియారాలు మన జీవితాల్లో ఓ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నది. స్మార్ట్ ఫోన్ వాడకం పెరగడంతో చేతి గడియారాల వాడకం కొంత తగ్గడం కూడా జరుగుతోంది. ప్రతి క్షణం సమయ నిర్ధారణ, వివిధ ఆకర్షణీయ హస్తకళా రూపాలు, మన సంస్కృతిలో భాగమైన గడియారం లేదా వాచ్ ప్రాధాన్యాన్ని గుర్తించిన పౌర సమాజం 2017 నుంచి ప్రతి ఏటా 19 జూన్ రోజున "జాతీయ గడియారం దినోత్సవం" లేదా "నేషనల్ వాచ్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. నార్డ్‌స్ట్రామ్ చొరవతో ఏర్పడిన జాతీయ గడియారం దినోత్సవం రోజు వాచ్ ప్రియులు, సాధారణ పౌరులు కలిసి ఐదు శతాబ్దాల గడియారం చరిత్రను నెమరు వేసుకుంటూ, డిజిటల్ యుగంలో సహితం కాలమాపకంగా వాడుకోవడం మన జీవనశైలిలో ఓ అలవాటు అయ్యింది.

### గడియారాల ఘన చరిత్ర :

మనకు ఇష్టమైన వాచ్‌ను ధరించడం, వివిధ వాచ్ డిజైన్ల ప్రదర్శనలు నిర్వహించడం, గడియారం దుకాణాలను సందర్శించడం, వాచ్‌ల చరిత్రను నెమరువేసుకోవడం, గడియారం పోటీలను నిర్వహించడం, మన గడియారాలను సర్వీసింగ్ చేయించడంతో, మన ఆత్మీయులకు వాచ్‌ను బహుమతిగా ఇవ్వడం, వింటేజ్ వాచ్‌లను అన్వేషించడం, సోషల్ మీడియా ప్రచారాలు చేయడం, గడియారం తయారీ వీడియోలను ప్రదర్శించడం లాంటి పలు కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహించవచ్చు. 16వ శతాబ్దంలో పీటర్ హెన్లీన్ తెలిసారు మెడలో ధరించే లాకెట్ వలె గడియారాన్ని తయారు చేయడం జరిగింది. 1868లో ఆధునిక మణికట్టు గడియారాన్ని పాటెల్ ఫిలిప్ రూపొందించారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటీష్ సైనికులు రిస్ట్ వాచ్‌లను విరివిగా వాడడం ప్రారంభించారు.

1926లో నీటి నిరోధక రోలెక్స్ వాచ్‌లను విడుదల చేశారు. 1970ల్లో క్వార్ట్జ్ వాచ్‌లతో పాటు డిజిటల్ ఎల్‌ఈడీ చేతి గడియారాలు, 1980ల్లో కళాత్మక వాచ్‌లు, 2004లో స్పాట్ వాచ్‌ల తయారీ ప్రారంభమైంది. చేతి గడియారాల వాడకానికి ముందు సైనికులు వాడడంతో యుద్ధ విధానాలు మారిపోయాయి.

మానవ జీవితాల్లో గడియారాలు సమయపాలనకు, వ్యక్తిత్వానికి, ఆరోగ్య నిర్వహణకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. నేటి వాచ్‌లు కేవలం సమయాన్ని సూచించడమే కాకుండా ఫ్యాషన్ రూపం, ఫిట్‌నెస్ మానిటర్, యాక్టివిటీ సాధనం, నోటిఫికేషన్లు, స్టేటస్ సింబల్, స్మార్ట్ కమ్యూనికేటర్‌గా కూడా బహుముఖ పాత్రలను పోషిస్తున్నది. మణికట్టు గడియారాన్ని వాడుతూ, సమయపాలన పాటిస్తూ, ఆత్మవిశ్వాసంతో పది మంది ముందు నిలుస్తూ, తమ జీవితాల్లో తక్కువ సమయంలో ఎక్కువ లక్ష్యాలను ఛేదిస్తూ ముందుకు సాగాలని నిర్ణయం తీసుకుందాం. సమయపాలనకు గడియారానికి పెద్ద పీట వేద్దాం.



-మధుపాళీ
9949700037

# ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో "నూతన భాగస్వామ్యాల ఏర్పాటు

న్యూఢిల్లీ, జూన్ 18:ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జరిగిన జీ7 సదస్సులో "నూతన భాగస్వామ్యాల ఏర్పాటు, అంతర్జాతీయ ఐక్యతను పునర్నిర్మించటం" అంశంపై ఇవాళ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు.

ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్, ఆర్థిక భద్రత వంటివి ఒకదానితో మరొకటి ముడిపడున్న అనుసంధాన ప్రపంచంలో మానవాళి పురోగతి, సంక్షేమానికి అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంపొందించుకోవటం ఎంతో అవసరమని ప్రధానమంత్రి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో స్వార్థ ప్రయోజనాల కోసం... వాణిజ్యం, సాంకేతికత దుర్వినియోగం అవుతున్నాయని, ఇది అంతర్జాతీయ వేదికపై విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తపరిచారు. కోవిడ్ మహమ్మారి నేర్పిన పాఠాలను ప్రస్తావిస్తూ.. అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో విశ్వాసం, పారదర్శకతను పెంపొందించటంపై దృష్టి సారించాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ సహకారం పట్ల భారత్ విధానాన్ని వెల్లడిస్తూ.. "మానవత్వమే ప్రథమ ప్రాధాన్యత" సూత్రాన్ని భారత్ ఎల్లప్పుడూ అనుసరిస్తుందని ప్రధాన మంత్రి తెలిపారు. అంతర్జాతీయ సౌర కూటమి, విపత్తును తట్టుకునే మౌలిక సదుపాయాల కూటమి, గ్లోబల్ బయో-ఫ్యూయల్ అలయన్స్, మిషన్ లైఫ్ లేదా ఏక్ పెడ్ మా కే నామ్ (మాతృమూర్తి కోసం మొక్క) వంటి ప్రచార కార్యక్రమాలను చేపట్టటంలో ఈ ఆలోచన ప్రధానంగా కొనసాగుతుందని చెప్పారు. శ్రీలంకలో తుఫాను, ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపం, మొజాంబిక్‌లో వరదలు, జమైకాలో హరికేన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సంభవించినప్పుడు భారత్ మొదటగా స్పందించేందుకు ఈ సమ్మిళిత విధానమే కారణమని తెలియజేశారు.

భారత సమ్మిళిత, సుస్థిర వృద్ధిని ప్రస్తావిస్తూ.. "సర్వ జన హితాయ, సర్వ జన సుఖాయ" (అందరి సంక్షేమం, సంతోషం) అనే మంత్రం ద్వారా ఆర్థిక సమ్మిళిత, ఆరోగ్య భద్రత, డిజిటల్ గుర్తింపు, సాంకేతికత ఆధారిత ప్రజా సాధికారత, మహిళా నేతృత్వంలోని అభివృద్ధిని పెంపొందించటంలో ప్రశంసనీయ ఫలితాలు వచ్చినట్లు వివరించారు.

అంతర్జాతీయ భాగస్వామ్యాలు దాత-గ్రహీత పరిధిని దాటి.. ఐక్యత, సమాన యాజమాన్యం దిశగా సాగాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాల పట్ల గౌరవం లేకపోవటమే దేశాల మధ్య ఐక్యత నిర్మాణానికి అతిపెద్ద అడ్డంకి అని, దీన్ని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాల్సిన అవసరముందని తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు చర్చలు, దౌత్యానికి తొలి ప్రాధాన్యత నివ్వాలని స్పష్టం చేశారు.

# ప్రతి ఇంటా యోగా..

## -సంపూర్ణ ఆరోగ్యానికి ఇదే మార్గం!

శ్రీకాకుళం, జూన్ 18:యోగాను నిత్యజీవితంలో అలవర్చుకోవాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ, ఇండస్ట్రీస్ జీఎం శ్రీధర్ సంయుక్తంగా పిలుపునిచ్చారు.



గురువారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ పార్కులో ఆయుష్ శాఖ సమన్వయంతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటా యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు, ఉద్యోగుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని యోగా దూరం చేస్తుందని తెలిపారు.

అనుభవజ్ఞులైన యోగాచార్యుల పర్యవేక్షణలో ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానంపై ఉచితంగా శిక్షణ పొందడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ మాట్లాడుతూ, యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది ఒక జీవన విధానమని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాలను యోగా ద్వారా మరింత మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు.

జిల్లా ఆయుష్ అధికారి ఉత్తమ్ రాజ్ రాణా మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు అద్భుతమైన వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని చెప్పారు. యోగా శరీరం, మనస్సు, ఆత్మను అనుసంధానించే సమగ్ర జీవన విధానమని వివరించారు.

ఈ కార్యక్రమంలో యోగా గురువులు పాండ్రంకి మురళీకృష్ణ, కొంక్యాన మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పరిశ్రమల శాఖ, ఆయుష్ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# జగన్మాతను దర్శించుకున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్

విజయవాడ జూన్ 18: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ వారిని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు దుర్గగుడి చైర్మన్ బొర్రా గాంధీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. బ్రహ్మం చౌదరి కుటుంబ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా దుర్గగుడి చైర్మన్ బొర్రా గాంధీ అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు రసీదును అందజేశారు

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అమరావతి, జూన్ 18: విజయవాడ లోని తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ రామచంద్రనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించిన ఆయన, తన సొంత వ్యయంతో ఉచిత వైద్య శిబిరాలతో పాటు అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు కూడా చేయిస్తున్నట్లు తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గద్దె క్రాంతికుమార్, తూమాటి ప్రేమనాథ్, తాడి బాబురావు, గద్దె రమేష్, పేరేపి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై ఎక్సైజ్ ఉక్కుపాదం

## -ప్రత్యేక దాడుల్లో నలుగురు అదుపులోకి
## -30 మద్యం సీసాల స్వాధీనం
## -పెనుగంచిప్రోలు, నందిగామలో కేసుల నమోదు
## -అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు

అమరావతి,జూన్ 18: అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నందిగామ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెనుగంచి ప్రోలు మండలంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసు కుని, 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు పెనుగంచిప్రోలు, అనిగండ్ల పాడు, శివాపురం గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వెనుక భాగంలో మొబైల్ సేల్స్ షాపు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను పట్టుకుని వారి వద్ద నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

అదేవిధంగా నందిగామ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడుతున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి పై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ. రమాదేవి, ఎస్ఐ గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై జిల్లావ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# వికసిత్ భారత్ కల సాకారం కోసం రాజ్యాంగం నుంచి స్ఫూర్తి పొందాలని యువతకు లోక్‌సభ స్పీకర్ పిలుపు

న్యూ ఢిల్లీ, జూన్ 18: లోక్‌సభ సచివాలయానికి చెందిన పార్లమెంటరీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీస్ (ప్రైడ్) సహకారంతో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహించిన 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026' కార్యక్రమాన్ని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ఈ రోజు సంవిధాన్ సదన్‌లోని చరిత్రాత్మక సెంట్రల్ హాల్‌లో ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి హాజరైన యువ ప్రతినిధులను ఉద్దేశించి శ్రీ బిర్లా మాట్లాడుతూ... భారత గొప్ప ప్రజాస్వామ్య సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ హాల్ లోనే వారు నిలబడి ఉన్నారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్దది అయిన భారత రాజ్యాంగాన్ని పౌరులందరికీ ఒక కచ్చితమైన మార్గదర్శిగా ఆయన అభివర్ణించారు. 'వికసిత్ భారత్' రోడ్‌మ్యాప్ గురించి చర్చిస్తున్న ఈ చరిత్రాత్మక వేదిక నుంచి స్ఫూర్తి పొందాలని యువతను ఆయన కోరారు.

భారత ప్రజాస్వామ్య ప్రక్రియలో భారీ స్థాయిలో యువత పాల్గొంటున్న తీరును ప్రధానంగా ప్రస్తావిస్తూ... ప్రస్తుతం 50 లక్షలకు పైగా యువత యూత్ పార్లమెంట్ కార్యక్రమంతో చురుగ్గా అనుబంధం కలిగి ఉన్నారని శ్రీ బిర్లా పేర్కొన్నారు. రాష్ట్రాలు, భాషలు, సాంస్కృతిక నేపథ్యాలకు అతీతంగా ఉన్న ఈ విభిన్న సమూహం... 'వికసిత్ భారత్' దార్శనికతను సాకారం చేసుకోవాలనే ఒకే ఒక్క సంకల్పంతో ఏకమైందని ఆయన స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్-2047' కలను సాకారం చేసే బాధ్యత యువతపైనే ఉందని పేర్కొంటూ, దేశ యువతను నిర్మాణాత్మక జాతి నిర్మాణం దిశగా నడిపిస్తున్నందుకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖను ఆయన ప్రశంసించారు. ఇది ప్రజాస్వామ్య విలువలు, సంభాషణలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం కోసం కీలక వేదిక అని లోక్‌సభ స్పీకర్ వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యం భారత పని సంస్కృతి, ప్రాచీన సంప్రదాయాల మూలాల్లో లోతుగా పాతుకుపోయిందని లోక్‌సభ స్పీకర్ స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్య ప్రస్థానం ప్రపంచవ్యాప్తంగా సాటిలేనిదని ఆయన పేర్కొన్నారు. భారత సామర్థ్యాలను గురించి మాట్లాడుతూ... అపారమైన వైవిధ్యం ఉన్నప్పటికీ స్వాతంత్ర్యానంతరం మన దేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎలా విజయవంతంగా ఆవిర్భవించిందో ఆయన వివరించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలు బయటి నుంచి దిగుమతి చేసుకున్న భావనలు కావనీ... ప్రాచీన సభలు, సమితుల ద్వారా అవి ప్రాచీన కాలం నుంచి పరిణామం చెందాయన్నారు. తద్వారా 75 ఏళ్లుగా ప్రజా భాగస్వామ్యం నిరంతరం బలపడటానికి, సంస్థాగత వృద్ధి పటిష్ఠంగా ఉండటానికి అవి మార్గం సుగమం చేశాయని ఆయన పేర్కొన్నారు.

భారత్ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించినప్పటి నుంచే పౌరులందరికీ సమాన హక్కులను కల్పించిన దార్శనికులైన భారత రాజ్యాంగ రూపకర్తలను శ్రీ బిర్లా ప్రశంసించారు. దేశ రాజ్యాంగంలోని మూల సూత్రాల గురించి మాట్లాడుతూ... అది సమాజంలోని ప్రతి వర్గానికి సమానత్వం, న్యాయం, సమాన అవకాశాల సూత్రాలను ప్రత్యేకంగా పొందుపరిచిందని ఆయన స్పష్టం చేశారు. అనేక దేశాల్లో మహిళలకు చాలా ఆలస్యంగా ఓటు హక్కు లభించగా... భారత్ మొదటి నుంచే సంపూర్ణ సమానత్వాన్ని ఎంచుకుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం భారత్ సార్వత్రిక వయోజన ఓటు హక్కును తక్షణమే అమలు చేయడం ఒక చరిత్రాత్మక మైలురాయిగా శ్రీ ఓం బిర్లా పేర్కొన్నారు.

భారత యువతను దేశ ఆవిష్కరణలకు ప్రధాన చోదక శక్తిగా అభివర్ణిస్తూ... దేశాన్ని మార్చడానికి అవసరమైన విశిష్టమైన శక్తి, 'నూతన సంకల్పం' రాబోయే తరానికి ఉన్నాయని శ్రీ బిర్లా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా, దేశీయంగానూ నాయకత్వ పాత్రల్లో మహిళల ప్రాతినిధ్యం వేగంగా పెరుగుతున్న తీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సైన్స్, టెక్నాలజీ నుంచి వ్యవసాయం, జాతీయ భద్రత వరకు మహిళలు సాంప్రదాయిక అడ్డంకులను ఛేదిస్తూ... సామాజిక పరివర్తనను ముందుకు నడిపిస్తున్నారని ఆయన గమనించారు. ప్రజాస్వామ్య, ఆర్థిక భాగస్వామ్యంలో ఈ సమ్మిళిత పెరుగుదల దేశంలో కొనసాగుతున్న జాతి నిర్మాణ ప్రక్రియకు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

క్షేత్రస్థాయి పాలనలో భారత్ సాధిస్తున్న నిశ్శబ్ద విప్లవాన్ని ఆయన ప్రశంసించారు. అనేక రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో మహిళల భాగస్వామ్యం చరిత్రాత్మకంగా 50 శాతానికి చేరుకుందని వెల్లడించారు. ఈ విజయాన్ని అత్యున్నత శాసన స్థాయిల్లో ప్రతిబింబించేందుకు చరిత్రాత్మక నారీ శక్తి వందన అధినియమ్ ఒక నిర్ణయాత్మక ముందడుగు అని శ్రీ బిర్లా అభివర్ణించారు. ఈ చట్టం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని శాశ్వతంగా పటిష్ఠం చేస్తుందని, తద్వారా భారత రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుందని ఆయన ఉద్ఘాటించారు.

నైతికత, ఆధ్యాత్మికత, ప్రజాస్వామ్య సంభాషణలతో కూడిన భారత విశిష్ట సామాజిక నిర్మాణం... యువతను ప్రజా జీవితానికి సహజంగానే సన్నద్ధం చేస్తుందని శ్రీ బిర్లా పేర్కొన్నారు. దేశాన్ని అత్యున్నత ప్రపంచ శిఖరాలకు నడిపించేందుకు... వారిలోని నూతన ఆవిష్కరణలను, సేవా స్ఫూర్తిని వినియోగించాలని ఆయన కోరారు. తాము ప్రాతినిధ్యం వహించాలనుకుంటున్న పౌరుల పట్ల సానుభూతి, సంపూర్ణ జవాబుదారీతనంలోనే నిజమైన నాయకత్వం ఇమిడి ఉందని ఆయన యువతకు గుర్తు చేశారు. సంవిధాన్ సదన్ పవిత్ర ప్రాంగణంలో యువ నాయకుల ఈ సమావేశం... రాబోయే తరాల హృదయాల్లో ప్రజాస్వామ్య బాధ్యత అనే శక్తిమంతమైన జ్వాలను రగిలిస్తుందని శ్రీ ఓం బిర్లా ఆశాభావం వ్యక్తం చేశారు.

యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ... లోక్‌సభ సెక్రటరీ జనరల్ శ్రీ ఉత్పల్ కుమార్ సింగ్... యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ పల్లవి జైన్ గోవిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సోషల్ మీడియాతో జాగ్రత్త..

## -అజిత్ సింగ్ నగర్ సీఐ చంద్రశేఖర్




అమరావతి, జూన్ 18:అజిత్ సింగ్ నగర్ యం. కే బేగ్ మున్సిపల్ హైస్కూల్లో అజిత్ సింగ్ నగర్ పోలీసులు విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజిత్ సింగ్ నగర్ సీఐ చంద్రశేఖర్ పాల్గొని నేటి బాలబాలికలే రేపటి పౌరులని, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం చదువుపైనే పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు. సోషల్ మీడియాను అనవసరమైన విషయాలకు వాడుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దని ఆయన హెచ్చరించారు. విజయవాడ సింగ్‌నగర్ లోని ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు సబ్ ఇన్స్పెక్టర్ రామారావు, స్కూల్ హెడ్ మాస్టర్ హుస్సేన్, పాఠశాల సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా మార్కుల పరిశీలన

అమరావతి, జూన్ 18: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌తో పాటు మనమిత్ర వాట్సాప్ సేవ ద్వారా కూడా తమ ఫలితాలను తెలుసుకునే అవకాశం కల్పించారు.

విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, ఇతర అవసరమైన వివరాలు నమోదు చేసి ఫలితాలను పరిశీలించవచ్చు. అలాగే మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా మార్కులు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈసారి సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థుల్లో 59 శాతం మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో 53 శాతం మంది తమ పని తీరును మెరుగుపరుచుకున్నట్లు వెల్లడైంది.



# యోగా పార్క్ పోర్టల్: బహిరంగ ప్రదేశాలను సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చటం

న్యూ ఢిల్లీ, జూన్ 18: భారత్‌లోని సామాజిక స్థలాలు, పట్టణ ప్రాంతాలు, పార్కులు ప్రజలను ఒకచోటికి చేర్చటమే కాక, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రోజురోజుకూ పట్టణాల్లో జీవన విధానం వేగవంతం అవుతున్న తరుణంలో శారీరక, మానసిక ఆరోగ్య కేంద్రాలుగా ఈ బహిరంగ ప్రదేశాల ప్రాధాన్యత పెరుగుతోంది. వీటి సామర్థ్యాన్ని గుర్తించిన కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఉన్న పార్కులను సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చేందుకు యోగా పార్క్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిద్వారా యోగా, ధ్యానం, ఆరోగ్యకరమైన జీవనం ప్రజల దైనందిన జీవితంలో భాగం కానున్నాయి.

అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 కోసం మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో 25 రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యోగా పార్క్ పోర్టల్‌ను కేంద్ర ఆయుష్ శాఖ సహాయమంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి శ్రీ ప్రతాప్ రావు జాదవ్ ప్రారంభించారు. తిరిగి ప్రారంభించిన యోగా సంఘం పోర్టల్‌తో పాటుగా దీన్ని ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ యోగాను విస్తరించేందుకు, దేశవ్యాప్తంగా స్థిరమైన ఆరోగ్య మౌలిక సదుపాయాలను రూపొందించటానికి మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రధాన కార్యక్రమాల్లో ఒకటిగా ఈ వేదిక నిలిచింది.

యోగా పార్క్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.. పార్కులను కేవలం వినోద స్థలాలుగా కాకుండా, సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా తీర్చిదిద్దటం. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటికే ఉన్న పార్కులను యోగా పార్కులుగా అభివృద్ధి చేయటంలో పంచాయతీ రాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ఇతర సంస్థలు భాగస్వాములు కావచ్చు. ఈ యోగా పార్కులు యోగా సాధన, ధ్యానం, ఆరోగ్య సంరక్షణ చర్యలు, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయి.

ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను వివరిస్తూ ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించేలా, భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేసే శాశ్వత సామాజిక ఆస్తులుగా యోగా పార్కులు ఉపయోగపడతాయని శ్రీ ప్రతాప్ జాదవ్ స్పష్టం చేశారు. యోగాను రోజువారీ జీవితంలో భాగం చేయాలని, దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో, నివాస సముదాయాల్లో ప్రజలకు సులభంగా ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉండేలా చూడాలన్న మంత్రిత్వ శాఖ విస్తృత నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది.

భౌతిక అభివృద్ధిపై దృష్టి సారించే సంప్రదాయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులా కాక ఆరోగ్యం, పర్యావరణ స్థిరత్వం, సామాజిక భాగస్వామ్యాలతో యోగా పార్క్ ఉంటుంది. ప్రస్తుతమున్న ప్రభుత్వ పార్కులను యోగా సాధన, ధ్యానం, సామాజిక ఆరోగ్య కార్యకలాపాలకు అనుకూలంగా ఆహ్లాదకరమైన ప్రదేశాలుగా తీర్చిదిద్దుతారు. అన్ని వయసుల వారు రోజూ పాల్గొనేలా ప్రోత్సహించటానికి ప్రత్యేక యోగా వేదికలు, ధ్యాన కేంద్రాలు, పచ్చిక మైదానాలు, అవగాహన సదుపాయాలు, సమూహాలుగా యోగా చేసుకునేందుకు వీలుగా ఖాళీ స్థలాలను అభివృద్ధి చేస్తారు.

అందరి భాగస్వామ్యంతో నమూనా ద్వారా అమలు చేయటం ఈ కార్యక్రమం విశిష్టత. అనువైన పార్కులను గుర్తించి, నిర్వహించటంలో స్థానిక అధికారులు, సామాజిక సంస్థలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అవగాహన కార్యక్రమాలకు, క్రమం తప్పని యోగా తరగతులకు యోగా సంస్థలు మద్దతిస్తాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా భాగస్వామ్యాన్ని కూడా ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుంది. స్థానిక సమాజాలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి కంపెనీలు సహకారం అందించవచ్చు.

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా ఏర్పాటు చేసే యోగా పార్కులు, రోజువారీ యోగా సాధన, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం అందుబాటులో ఉండే స్థలాలను అందించటం ద్వారా ప్రజారోగ్యానికి శాశ్వత వారసత్వాన్ని సృష్టించగలవని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇందులో పాల్గొనే కంపెనీలు సామాజిక సంక్షేమానికి చేసిన కృషికి తగిన గుర్తింపును పొందవచ్చు. ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించటంలో ప్రైవేట్ రంగం పాత్రను మరింత బలోపేతం చేస్తుంది.

మౌలిక సదుపాయాల అభివృద్ధికి మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా భాగస్వామ్యం కోసం రూపొందించిన డిజిటల్ వ్యవస్థే యోగా పార్క్ పోర్టల్. ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు అవసరమైన మార్గదర్శకాలు, కాన్సెప్ట్ నోట్స్, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, ఇతర వనరులను ఈ వేదిక అందిస్తుంది. ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థలు, కమ్యూనిటీ సంస్థలు, కార్పొరేట్ భాగస్వాములను ఈ పోర్టల్ పరిధిలోకి తీసుకురావటం ద్వారా ఆరోగ్యం, సంరక్షణే లక్ష్యంగా సమన్వయ జాతీయ ఉద్యమాన్ని రూపొందించాలని మంత్రిత్వ శాఖ భావిస్తోంది.

ఈ కార్యక్రమం అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 ఇతివృతం "వృద్ధాప్యంలో ఆరోగ్య సంరక్షణకు యోగా"కి అనుగుణంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా జీవనశైలి సమస్యలు, మానసిక ఒత్తిడి, వయసురీత్యా ఆరోగ్య సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో క్రమం తప్పకుండా శారీరక శ్రమ, మానసిక ప్రశాంతత, సామాజిక సంబంధాలను పెంపొందించటంలో ఇలాంటి బహిరంగ ఆరోగ్య సంక్షేమ స్థలాలు కీలక పాత్ర పోషిస్తాయి. పిల్లలు, యువత, ఉద్యోగ నిపుణులు, వయోవృద్ధులు, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగా సాధన చేయటం ద్వారా ప్రయోజనం పొందేలా, అందరికీ అందుబాటులో ఉండే వాతావరణాన్ని కల్పించేందుకే ఈ యోగా పార్కులు.

యోగా పార్క్.. కేవలం ఏటా జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవానికే పరిమితం కాకుండా సుదీర్ఘకాలం నిలిచిపోయే వారసత్వాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సామూహిక యోగా ప్రదర్శనలు, బహిరంగ కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఆరోగ్య కేంద్రాలు సంవత్సరం పొడవునా పౌరులకు సేవలు అందించగల శాశ్వత వనరుగా మారతాయి. ఈ విధంగా, ఈ కార్యక్రమం కేవలం ఒకరోజు జరిగే ఈవెంట్‌లాగా కాకుండా, ప్రజల జీవితాల్లో నిరంతర ఆరోగ్య అలవాటుగా మారేలా మార్పును తీసుకొస్తుంది. దశాబ్ద కాలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య ఉద్యమాల్లో ఒకటిగా మారింది. ఈ వేగాన్ని యోగా పార్క్ పోర్టల్ మరింత ముందుకు తీసుకెళ్తూ అవగాహన కల్పించటమే కాక మౌలిక సదుపాయాల కల్పనగా, ప్రజల భాగస్వామ్యాన్ని సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే విధంగా మారుస్తోంది. భారత్‌లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరిన్ని పార్కులను ఈ కార్యక్రమంలో భాగం చేయటం ద్వారా ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ సామరస్యం, సంపూర్ణ సంక్షేమం పట్ల భారతదేశ నిబద్ధతకు యోగా పార్క్ శాశ్వత చిహ్నంగా మారనుంది.

## భారత్ ఇన్నోవేట్స్ - 2026 రెండో రోజు పెట్టుబడిదారులు - అంకుర సంస్థలపై దృష్టి

న్యూ ఢిల్లీ, జూన్ 18: భారత్ ఇన్నోవేట్స్-2026 రెండో రోజున (2026 జూన్ 15) అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామిక దిగ్గజాలు, పరిశోధకులు, విధానరూపకర్తలు, అంకురసంస్థలు, విద్యా సంస్థలు మధ్య విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి. ఆవిష్కరణలను వేగవంతం చేయడం, సాంకేతిక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, డీప్‌టెక్ పరిష్కారాల వాణిజ్యీకరణను ముందుకు తీసుకెళ్లడంపై ఈ చర్చల్లో దృష్టి సారించారు.

భారత ప్రభుత్వం ప్రారంభించిన భారత్ ఇన్నోవేట్స్-2026ను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చేపడుతోంది. మన దేశంలో వేగంగా విస్తరిస్తున్న అంకుర సంస్థలు, ఆవిష్కరణల రంగాన్ని అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు, పారిశ్రామిక దిగ్గజాలు, పరిశోధనా వ్యవస్థలు, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించే గొప్ప వేదిక ఇది.

బయో టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, అధునాతన తయారీ, ఆరోగ్య సేవలు, ఇంధనం, రవాణా రంగం, అంతరిక్షం, కృత్రిమ మేధ రంగాల్లో భారతీయ అంకుర సంస్థలు, ప్రముఖ విద్యా సంస్థలు అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ప్రదర్శించే ఇన్నోవేషన్ షోకేస్ తో ఈ రోజు ప్రారంభమైంది.

ఏషియన్ పెయింట్స్ కో ప్రమోటర్, ఏంజెల్ ఇన్వెస్టర్ అయిన శ్రీ జలజ్ డానీ ముఖ్య వక్తగా ప్రసంగించారు. మార్కెట్ డిమాండు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక సంస్థాగత నిర్మాణంతో శాస్త్రీయ ఆవిష్కరణలను అనుసంధానించడానికున్న ప్రాముఖ్యాన్ని ఆయన వివరించారు.

పారిశ్రామిక, పెట్టుబడులు, పరిశోధనా రంగానికి చెందిన ప్రముఖులు బృంద చర్చల్లో పాల్గొన్నారు. వారిలో పాశ్చర్ సంస్థకు చెందిన ప్రొఫెసర్ చేతన్ చిట్నీస్, సఫ్రాన్ రియోస్క్ సీఈవో అరేలీ గిరో, థేల్స్ అలేనియా స్పేస్ ప్రతినిధి బెర్ట్రాండ్ డెనిన్, జీఐఎఫ్ఏఎస్ సీఈవో ఫ్రెడ్రిక్ పారిసోట్, సోనీ ఇన్నోవేషన్ ఫండ్ ప్రతినిధి యోకో ఫుకాటా, మిజుహో ఫైనాన్షియల్ గ్రూప్‌నకు చెందిన సునీల్ భక్షి ఉన్నారు. బయో-ఇన్నోవేషన్, అధునాతన తయారీ, అంతరిక్షం, రక్షణ రంగ సరఫరా వ్యవస్థలు, అంతర్జాతీయ పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా దీర్ఘకాలిక పెట్టుబడులపై, అంతర్జాతీయ సహ అభివృద్ధిపై, పరిశోధనలను వాణిజ్య స్థాయికి తీసుకెళ్లడంపై ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు.

# దొర మెప్పు కోసమే కొప్పుల, ఆర్ఎస్‌పీ ఆరాటం

-కేసీఆర్ అవమానించినప్పుడు అండగా నిలిచాను..
-దోచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పేటెంట్ హక్కు
-సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కరీంనగర్, జూన్ 18: హరీష్ రావు మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొరలు అవమానించినప్పుడు కొప్పుల ఈశ్వర్‌కు సాటి దళితుడిగా అండగా నిలిచానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దోచుకోవడం, దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పేటెంట్ హక్కు అని విమర్శించారు. ఏడాది క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు చేపట్టానని, గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్ పనిచేశారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాలల కార్యదర్శిగా పనిచేశారని, అయితే ఏడాది కాలంగా ఆయా శాఖలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

**రూ.2 వేల కోట్ల అవినీతి అంటూ అసత్య ప్రచారం**

సంక్షేమ శాఖలో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు ఆరోపిస్తే, ఆ శాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు అవసరమైన వస్తువుల కొనుగోలు కోసం రూ.683 కోట్లతో టెండర్లు పిలిచామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రూ.500 కోట్ల కొనుగోళ్లు చేపట్టామని తెలిపారు. మొత్తం రూ.1,183 కోట్లకు టెండర్లు పిలిస్తే, రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు చెప్పడం సిగ్గుచేటని అన్నారు. తాను జవాబు చెబితే, దొరగారి మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ 'ఖబర్దార్' అని మాట్లాడటం మరింత సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

**2018లో కొప్పుల ఎలా గెలిచారు**

2018 ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఎలా గెలిచారో తెలంగాణ ప్రజలందరికీ తెలుసని మంత్రి అన్నారు. కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ తాళం పోయిన ఘటనపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేదన్నారు. 2009లో కొప్పులపై పోటీ చేసి కేవలం 1,165 ఓట్ల తేడాతో ఓడిపోయానని, 2014లో 16 వేల ఓట్ల మెజారిటీతో ఓడిపోయానని గుర్తు చేశారు. తెలంగాణ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి పోటీ చేసిన సమయంలో రాష్ట్రంలో ఎవరికీ డిపాజిట్ రాకపోయినా, తనకు మాత్రమే డిపాజిట్ వచ్చిందన్నారు.

ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గానికి పెద్దగా ఏమీ చేయలేదన్నారు. డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో వంటి కీలక సదుపాయాలు తీసుకురాకపోవడంతోనే 2023 ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పారని అన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు కొప్పుల ఈశ్వర్‌కు మద్దతు ఇవ్వలేదని పేర్కొన్నారు.

**జీవన్ రెడ్డి వాటా ఎంతో చెప్పాలి**

కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి వద్ద కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని మంత్రి అన్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో వడ్లు కొనుగోలు చేసిందని, మరి ఆ సమయంలో ఆయనకు ఎంత కమిషన్ వచ్చిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

-పెండింగ్ బిల్లులపై సమగ్ర నివేదిక సమర్పించాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, జూన్ 18: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.

గురువారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఎంఐడీసీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై శాఖల వారీగా సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అవసరమైన కొత్త అభివృద్ధి ప్రతిపాదనలు ఉంటే రూపొందించి పంపాలని సూచించారు. ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

పనుల అమలులో ఎక్కడైనా లోపాలు లేదా క్రిటికల్ గ్యాప్స్ ఉంటే వెంటనే గుర్తించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

జిల్లాలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.

సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఆర్అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన శ్రీవిద్యకు అభినందనలు

ఆదిలాబాద్, జూన్ 18: చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన హెచ్చు నర్సింహ కుమార్తె హెచ్చు శ్రీవిద్య ఇటీవల విడుదలైన ఐఐఐటీ బాసర తొలి విడత ఎంపికల జాబితాలో చోటు దక్కించుకోవడంతో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం ఆమెను అభినందించారు. చిన్నకాపర్తి గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొచ్చి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా శ్రీవిద్య విద్యా ప్రతిభను కొనియాడిన ఎమ్మెల్యే వేముల వీరేశం రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ నగదు బహుమతిని శ్రీవిద్యకు అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడం ఆనందదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# నిఘా నీడలో కోరుట్లపేట.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి

-11 సీసీ కెమెరాల ప్రారంభం..
-రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి : ఎస్పీ మహేష్ బి. గితే





నల్గొండ, జూన్ 18: కోరుట్లపేట గ్రామం ఇకపై నిఘా నీడలో ఉంటుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని కోరుట్లపేట గ్రామంలో 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రజలతో నిర్వహించిన అవగాహన సదస్సులో సీసీ కెమెరాల ప్రాముఖ్యత, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సహకారంతో జిల్లాలో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందన్నారు. నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టి, నిందితులపై వేగంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి..

మేడ్చల్, జూన్ 18: మేడ్చల్ జిల్లాలో ఇవాళ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఈ విషాదం చోటు చేసుకుంది.



మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి- మురహరిపల్లి మధ్య ఈ ప్రమాదం జరిగింది. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో కారులో ప్రయాణిస్తున్న భార్యభర్తలు, వారి కుమారుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.


**ఆహ్వానం**

**శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య**
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
**శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో**
శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు



" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్ |
| సభాధ్యక్షులు | : | శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త |
| విశిష్ట అతిథి | : | శ్రీ కళా జనార్ధన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం |
| పురస్కార గ్రహీత | : | శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజీషియన్ |
| ప్రత్యేక ఆహ్వానితులు | : | శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్ |
| ఆత్మీయ అతిథి | : | శ్రీమతి పొత్తూరి జయలక్ష్మీ, మేనేజర్ సాహితీ కిరణం |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్ |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని |

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
**శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య**
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.





# మారుతున్న వాతావరణం మారాల్సిన వ్యవసాయం



భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్ల మంది ప్రజల జీవనాధారానికి వ్యవసాయ రంగమే వెన్నెముక అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశీయ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాల జూదంగానే సాగుతోంది. దేశం మొత్తం మీద ఏడాది పొడవునా కురిసే వార్షిక వర్షపాతంలో సింహభాగం, అనగా దాదాపు 75 శాతం వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ వరకు విస్తరించే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. అందువల్లనే, భారతీయ రైతాంగానికి అత్యంత కీలకమైన ఖరీఫ్ (వర్షాకాలం) పంటల విజయాపజయాలు పూర్తిగా ఈ వర్షాల పంపిణీపైనే ఆధారపడి ఉంటాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్) ప్రభావాలు మరియు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' వంటి తీవ్ర సముద్ర వాతావరణ పరిస్థితులు రుతుపవనాల గమనాన్ని తీవ్రంగా గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీని ఫలితంగా ఒకే ఏడాదిలో కొన్ని ప్రాంతాల్లో మేఘమథనంతో కూడిన అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో చుక్క నీరు లేని అనావృష్టి ఏర్పడి వర్షపాత పంపిణీలో తీవ్రమైన ప్రాంతీయ అసమతుల్యత చోటు చేసుకుంటోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో కాలం చెల్లిన సంప్రదాయ సాగు విధానాలను పక్కనబెట్టి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలోనూ, సాగు నిర్వహణలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకు రావలసిన చారిత్రక అవసరం నేడు రైతాంగంపై ఉంది.

శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తే, ఎల్‌నినో అనేది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని సూచించే ఒక సంక్లిష్ట వాతావరణ ప్రక్రియ. స్పానిష్ భాషలో 'చిన్న బాలుడు' లేదా 'ఏసుక్రీస్తు శిశువు' అని పిలవబడే ఈ దృగ్విషయం, ప్రపంచవ్యాప్త వాతావరణ నమూనాలను తలకిందులు చేసే శక్తిని కలిగి ఉంది. పసిఫిక్ సముద్రంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వాతావరణ పీడన వ్యవస్థల్లో మార్పులు వచ్చి, భారతదేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవన గాలులు బలహీనపడతాయి. భారత వాతావరణ శాఖ గత వందేళ్ల చారిత్రక గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదైన భయంకరమైన కరవు సంవత్సరాలలో అత్యధిక భాగం ఎల్‌నినో ప్రభావంతో కూడుకున్నవేనని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, 2002 వ సంవత్సరంలో ఎల్‌నినో కారణంగా దేశంలో 19 శాతం వర్షపాత లోటు ఏర్పడి అపార పంట నష్టం సంభవించింది. అలాగే 2009లో గత నాలుగు దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరవు నమోదైంది. ఆ తర్వాత 2015 మరియు ఇటీవలి 2023 సంవత్సరాలలో సైతం ఎల్‌నినో దేశవ్యాప్త వర్షపాతంలో భారీ లోటును మిగిల్చింది, తద్వారా జలాశయాలలో నీటి మట్టాలు పడిపోయి, భూగర్భ జలాధారాలు అడుగంటి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయింది.

సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షాలు వారాల తరబడి ఆలస్యమవడం లేదా ప్రారంభంలో కురిసి ఆ తర్వాత సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడటం సర్వసాధారణం. జూన్, జూలై నెలల్లో కురిసే తొలి వర్షాలను నమ్మి రైతులు తొందరపడి విత్తనాలు చల్లితే, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో నేలలోనే విత్తనాలు మాడిపోయి మొలకెత్తని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది రైతులకు పెట్టుబడి నష్టాన్ని మిగల్చడమే కాకుండా, మళ్లీ విత్తవలసిన దుస్థితికి దారితీస్తుంది. ఇటువంటి అనిశ్చిత సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రాథమిక సూచన ఏమిటంటే, రైతులు తొందరపాటు పడకుండా తమ ప్రాంతంలో కనీసం 75 నుండి 100 మిల్లీమీటర్ల వరకు స్థిరమైన మరియు తగినంత వర్షపాతం నమోదై, భూమి లోపలి పొరల వరకు తేమ చేరినట్లు నిర్ధారించుకున్న తర్వాతే ప్రధాన పంటల విత్తన ప్రక్రియను ప్రారంభించాలి. ఒకవేళ కాలం గడుస్తున్నా వర్షాలు పడకపోతే, సుదీర్ఘ కాల పరిమితి గల పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవడమే బుద్ధిమంతం. ఇందుకోసం ఆయా రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలు రూపొందించే 'ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను' నిరంతరం గమనిస్తూ అమలు చేయాలి.

సాధారణ వాతావరణ పరిస్థితుల్లో జూన్ మాసంలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశెనగ, వరి వంటి సాంప్రదాయ ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంటుంది. అయితే వర్షాలు జూలై మొదటి వారం వరకు ఆలస్యమైతే, రైతులు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. ఎక్కువ నీరు, ఎక్కువ కాలం తీసుకునే రకాలకు బదులుగా స్వల్పకాలిక మొక్కజొన్న రకాలు, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు లేదా నువ్వులు వంటి నూనెగింజల పంటల వైపు మళ్లడం ఎంతో శ్రేయస్కరం. ఒకవేళ వర్షాభావం మరింత తీవ్రమై జూలై రెండో పక్షం లేదా ఆగస్టు వరకు కూడా తగినంత వర్షపాతం లేకపోతే, అసలు సంప్రదాయ పంటల ఆలోచనే పక్కనబెట్టి జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగుకు శ్రీకారం చుట్టాలి. ఈ తృణధాన్యాలు అత్యంత తక్కువ నీటి లభ్యతతో, కరవు పరిస్థితులను సైతం తట్టుకుని అద్భుతంగా పెరుగుతాయి. పైగా ప్రస్తుత కాలంలో ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడం వల్ల మార్కెట్‌లో ఈ చిరుధాన్యాలకు మరియు పప్పుధాన్యాలకు అత్యధిక డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటం రైతులకు అదనపు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది.

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఖరీఫ్ సీజన్ అనగానే అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగు



చేయడం కనిపిస్తుంది. పత్తి లాభదాయక పంట అయినప్పటికీ, దానికి ప్రారంభ దశలోనూ, పూత, కాత దశల్లోనూ సమతుల్యమైన తేమ అవసరం. ఎల్‌నినో సృష్టించే వర్షాభావ పరిస్థితుల్లో పత్తి మొక్కల పెరుగుదల క్షీణించి, దిగుబడులు దారుణంగా పడిపోతాయి. కాబట్టి, వాతావరణం అనుకూలించనప్పుడు పత్తి సాగు విస్తీర్ణాన్ని ఐచ్ఛికంగా తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా అంతర పంటల పద్ధతిలో కంది, పెసర, మినుము వంటి లెగ్యుమినేస్ (నత్రజనిని స్థిరపరిచే) పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా, ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా పెట్టుబడిని రాబట్టుకునే వీలుంటుంది.

ఇక తెలుగు ప్రజల ప్రధాన ఆహార పంట అయిన వరి సాగు విషయానికి వస్తే, నీటి వినియోగంపై పెను మార్పులు రావాల్సి ఉంది. ఎకరానికి వేల లీటర్ల నీరు అవసరమయ్యే సంప్రదాయ వరద నీటి పద్ధతి వరి సాగుకు ఎల్‌నినో కాలంలో స్వస్తి చెప్పక తప్పదు. సుదీర్ఘ కాలపరిమితి గల వరి రకాల స్థానంలో 120 రోజుల లోపు పండే స్వల్పకాలిక మరియు నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. అలాగే, సాంప్రదాయ పద్ధతిలో నారు పోసి, నీరు నిలగట్టి నాట్లు వేసే విధానానికి స్వస్తి పలికి, 'నేరుగా విత్తే వరి పద్ధతి' లేదా 'శ్రీ వరి విధానం' వంటి అధునాతన నీటి పొదుపు సాంకేతికతలను అవలంబించాలి. ఈ ఆధునిక పద్ధతుల ద్వారా సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడి తగ్గకపోగా, నీటి వినియోగాన్ని 25 నుండి ఏకంగా 40 శాతం వరకు ఆదా చేయవచ్చు. నీటి లభ్యత తక్కువగా ఉన్న తరుణంలో ప్రతి నీటి బొట్టును అమృతంగా భావించి పొదుపుగా వాడుకోవడమే వ్యవసాయాన్ని నిలబెడుతుంది.

పంటల ఎంపిక ఎంత ముఖ్యమో, పడిన వర్షపు నీటిని భూమిలో ఇంకించి, నేల తేమను సంరక్షించుకోవడం అంతకంటే ముఖ్యం. వేసవి లోతైన దుక్కులు చేయడం వల్ల వర్షపు నీరు త్వరగా భూమిలోకి ఇంకుతుంది. పొలం చుట్టూ గట్లను బలోపేతం చేయడం, వాలుకు అడ్డంగా కాంటూర్ బండ్లు (గట్లు) ఏర్పాటు చేయడం వల్ల వర్షపు నీరు వృధాగా కొట్టుకుపోకుండా ఆ పొలంలోనే నిలిచి భూగర్భ జలమట్టాన్ని పెంచుతుంది. పంట వ్యర్థాలను, ఆకులను నేలపై పరచడం (మల్చింగ్ పద్ధతి) ద్వారా సూర్యరశ్మి నేరుగా నేలపై పడకుండా నిరోధించవచ్చు, తద్వారా భూమిలోని తేమ ఆవిరి కాకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. ప్రతి గ్రామంలోనూ, పొలాల్లోనూ ఫార్మ్ పాండ్లు (పంట సంజీవని కుంటలు), చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా అత్యవసర సమయాల్లో పంటలను కాపాడుకోవడానికి అవసరమైన రక్షక తడులను అందించే వీలు కలుగుతుంది.

ఈ విపత్కర వాతావరణాన్ని తట్టుకోవడంలో విత్తన శుద్ధి కీలక పాత్ర పోషిస్తుంది. కరవును, తెగుళ్లను తట్టుకునే ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే సేకరించి, విత్తే ముందు తగిన శిలీంద్రనాశకాలు లేదా జీవ నియంత్రణ కారకాలతో విత్తన శుద్ధి చేయడం వల్ల మొలక శాతం పెరగడమే కాకుండా, ప్రారంభ దశలో వచ్చే వ్యాధుల నుండి మొక్కలకు రక్షణ లభిస్తుంది. అలాగే, ఎల్‌నినో సమయాల్లో విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల మొక్కలు మరింత త్వరగా ఎండిపోయే ప్రమాదం ఉంది. అందుకే, ముందస్తుగా నేల పరీక్షలు నిర్వహించి, భూమిలో ఉన్న పోషకాల లభ్యతను బట్టి శాస్త్రీయంగా అవసరమైన మోతాదులోనే ఎరువులను, వీలైతే సేంద్రీయ మరియు ద్రవ రూప ఎరువులను (లిక్విడ్ ఫెర్టిలైజర్స్) సూక్ష్మ నీటి పారుదల (డ్రిప్ లేదా స్ప్రింక్లర్) పద్ధతుల ద్వారా అందించాలి.

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడించడం అత్యంత ఆవశ్యకమైన అంశం. భారత వాతావరణ శాఖ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు ఉపగ్రహ సమాచారం ఆధారంగా నిరంతరం అందిస్తున్న జిల్లా మరియు మండల స్థాయి స్వల్పకాలిక, మధ్యకాలిక వాతావరణ సూచనలను రైతులు గమనిస్తూ ఉండాలి. మొబైల్ యాప్‌ల ద్వారా అందుతున్న ఐదు రోజుల ముందస్తు వాతావరణ అంచనాల ఆధారంగా విత్తడం, ఎరువులు వేయడం, పురుగుమందుల పిచికారీ వంటి సాగు పనులను ప్రణాళిక చేసుకోవడం ద్వారా అనవసరపు ఖర్చులను, వాతావరణ నష్టాలను అధిగమించవచ్చు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రకృతి వైపరీత్యాల తీవ్రత వల్ల పంట నష్టం సంభవిస్తే రైతులు ఆర్థికంగా చితికిపోకుండా ఉండేందుకు 'వ్యవసాయ బీమా పథకాలు' ఒక అద్భుతమైన రక్షణ కవచంలా పనిచేస్తాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి ప్రభుత్వ పంట బీమా పథకాలలో అర్హులైన రైతులందరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. వ్యక్తిగత సాగు వ్యయాలను తగ్గించుకోవడానికి, చిన్న మరియు సన్నకారు రైతులు గ్రూపులుగా ఏర్పడి 'రైతు ఉత్పత్తిదారుల సంఘాలు' లేదా సహకార సంఘాల ద్వారా ఉమ్మడిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం మరియు యంత్రాలను అద్దెకు తీసుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించు కోవచ్చు. అలాగే దళారీల వ్యవస్థను దాటి ఉమ్మడి మార్కెటింగ్ సదుపాయాల ద్వారా తమ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను సాధించు కోవచ్చు.

ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను మరియు పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంతకంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాల సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పన తోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయకేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచగలదనడంలో ఎటువంటి సందేహం లేదు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

## ఒకే వేదికపై అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు..

### ధీమాటిక్ యోగాలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు

కర్నూలు, జూన్ 18: అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా కర్నూలు ఎస్‌ఏపీ క్యాంపు ఆవరణలో నిర్వహించిన ధీమాటిక్ యోగా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాసనాలు చేస్తూ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

యోగ సాధన ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని అధికారులు పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనశైలికి యోగా ఉత్తమ మార్గమని వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని అన్నారు. వారి ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. యోగా ఆరోగ్యవంతమైన జీవన విధానానికి బాటలు వేస్తుందని తెలిపారు.

## యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

### రైతులు నేరుగా మొబైల్ ద్వారా యూరియా బుక్ చేసుకునే అవకాశం



నాగర్‌కర్నూల్, జూన్ 18: రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు ఎరువుల కోసం పడే ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా బుకింగ్ యాప్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాలో గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ యాప్‌ను ప్రారంభించారు. జిల్లాలోని 20 మండలాల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులకు సూచించారు. యాప్ ప్రారంభ దశలో సాంకేతిక సమస్యలు ఎదురైనా వాటిని అధిగమించి సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే యూరియా నిల్వలను సిద్ధం చేసిందని, రైతులకు కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సుమారు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యాప్ ద్వారా రైతులు ముందుగానే యూరియాను బుక్ చేసుకోవచ్చని, దీంతో డీలర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. యాప్ ఆధారంగా పంపిణీ చేపట్టడం వల్ల పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు, ఇతర అధికారులు, డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.